క్లుప్తంగా

ప్రజా పాలనపై కళాజాతా



మరికల్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకోవడంతో ప్రజా పాలనపై ఆదివారం మండలంలోని కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ మేరకు.. ఎంపీడీఓ కొండన్న మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను అందరికీ అందివ్వడమే లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు అమలు చేసి ప్రజాపాలన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోపాల్, వీరన్న, రాజు, శ్రీను, చెన్నప్ప, రామకృష్ణ, రఘు, అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి



ఊట్కూరు: మండల పరిషత్ భవనంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీని ఆదివారం అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ రవి, ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని ఆపరేటర్‌లకు సూచించారు. సకాలంలో డాటా ఎంట్రీని పూర్తి చేయాలన్నారు. రోజువారిలా ఎన్ని ఇళ్లను డాటా పూర్తి చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సెక్రటరీ శ్రీనివాసారావు, రాఘవేందర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లిలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమై రూ. 40వేల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కుర్వన్నప్ప శివారులో వరిగడ్డిని నిల్వ చేశారు. మధ్యాహ్నం వేళలో ప్రమాదవశాత్తు పశుగ్రాసానికి నిప్పంటుకున్నాయి. స్థానికులు మక్తల్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే వరికుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ. 40వేల ఆస్తినష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



కొత్తపల్లి: మండల కేంద్రంలోని వివిధ కారణాలతో పలు ఆస్పత్రులలో చికిత్సపొంది ఆర్థిక ఇబ్బందులతో సీఎం సహాయనిధి కోసం లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. వారికి మంజూరైన రూ. 2 .44 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు చన్నప్ప, నీలారెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు.

హామీలను నెరవేర్చాలి..

కృష్ణా: ప్రభుత్వం రైతులు పండించిన సన్నరకాల వరి ధాన్యానికి ఇస్తామన్నా రూ. 500ల బోనస్ డబ్బులు ఇవ్వకుండానే విజయోత్సవ సంబరాలకు సిద్ధం కావడం హేయంగా ఉందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలలో ప్రధానంగా రుణమాఫీతోపాటు రైతుబంధు, బోనస్ డబ్బులు ఇలా ప్రతి విషయంలో మోసం చేసిందన్నారు. ఈ విషయంలో త్వరలోనే తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు

మరికల్: మండలంలోని కన్మనూర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాకపోవడంతో తరచుగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలం నుంచి నిత్యం ఈ రోడ్డుపై సర్వ వరకు వాహనాలు రాకపోకలు కొనసాగుతున్నాయని, వెంటనే మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- మూలనపడ్డ క్రీడా సామగ్రి
- ఆటలకు దూరమవుతున్న క్రీడాకారులు
- లక్ష్యానికి చేరలేకపోయిన క్రీడా ప్రాంగణాలు
- పట్టించుకోని అధికారులు



ముళ్లపొదల్లో గున్ముక్ల క్రీడా మైదానం

ధన్వాడ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు అవసరమైన సామగ్రిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. ఇందుకోసం దాదాపు రూ. 4లక్షల వరకు కేటాయించి నిర్మాణ పనులను చేపట్టింది. 2023 సంవత్సరం సెప్టెంబర్ నెలలలో అప్పటి ఎమ్మెల్యేలు సామగ్రిని పంపిణీ చేశారు. వీటిని గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉంచి ఆటలు ఆడుకునే వారికి ఇచ్చి తిరిగి పంచాయతీలకు అప్పగించాలని నిబంధనలు పెట్టింది. కాని వాటిని గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో క్రీడా సామగ్రి మూలన పడ్డాయి. కొన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు కనిపించడం లేదు. క్రీడా ప్రాంగణాలు చదును చేసి సామగ్రిని అందించాలని క్రీడా కారులు కోరుతున్నారు.

అధ్వానంగా...

కోండ్రోస్‌పల్లిలో క్రీడా ప్రాంగణాలను పంట పొలాల్లో ఏర్పాటు చేయడంతో చాలా ప్రాంగణాలు చెట్లు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా ఉన్నాయి. క్రీడా మైదానాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అలంకారంగా మారాయి. క్రీడా మైదానాలకు కేటాయించిన ధనం వృథా అయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్రీడా సామగ్రి అందజేయాలి..



గ్రామంలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాలు ఆటలాడేందుకు అనుకూలంగా లేవు. అందులో పిచ్చి మొక్కలు పెరిగి క్రీడా సామగ్రి ఎక్కడ ఉందో కూడా తెలియడం లేదు. అధికారులు స్పందించి ప్రాంగణాలు చదునుచేసి సామాగ్రి అందజేయాలి.

- ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గున్ముక్ల గ్రామం

వినియోగంలోకి తీసుకొస్తాం..

ఆయా పంచాయతీల పరిధిలో క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకోస్తాం. క్రీడా సామగ్రిని క్రీడాకారులకు అందించేలా చర్యలు తీసుకుంటాం.

- సాయిప్రకాష్, ఎంపీడీఓ, ధన్వాడ

ఆత్మరక్షణకు కరాటే అవసరం



కరాటే శిక్షణను ప్రారంభిస్తున్న రవికుమార్‌గౌడ్

నారాయణపేట టౌన్: విద్యార్థులు కరాటే నేర్చుకోవడంతో ఆత్మరక్షణకు ఎంతగాను దోహదపడుతుందని లయన్స్ సభ్యుడు రవికుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం కరాటే శిక్షణను ఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణ చుట్టూ పక్కల ప్రాంతాల వారికి ఎన్నో ఏళ్లుగా కృష్ణ గోకులం స్కూల్ మొదటి యూనిట్ కరాటేలో శిక్షణ అందిస్తూ సుపరిచితులైన మాస్టర్ మాడివాల్ అశోక్‌ను అభినందించారు. నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ విధిగా కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరాటే విద్యార్థులు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు



విద్యార్థులచే భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

నారాయణపేట ఎడ్యుకేషన్: పట్టణంలోని శిశు మందిర్‌లో రాబోయే గీతా జయంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మండల స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఎంపిక చేసి డిసెంబర్ 1న పాలమూరులో జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు నర్సింహులు, కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మార్క్సలైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ



మాగనూర్‌లో కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: సకల సమస్యలకు పరిష్కారం మార్క్సిజం అని సీపీఐఎంఎల్ మార్క్సలైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ అన్నారు. ఆదివారం బిజ్వార్‌లో లెనిన్ శతవర్ధంతి సందర్భంగా జిల్లా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మోదీ తెచ్చిన మూడు చట్టాలు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కోసం రైతులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. కార్మికులకు, రైతులకు హక్కులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ కార్మికవర్గం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాశీనాథ్, కిరణ్, సలీం, వెంకట్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేద్దాం

మాగనూర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న జిల్లా కేంద్రంలో జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి. ఆంజనేయులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. మధుసూదన్‌రెడ్డి, బాలు, బ్యాగరి నర్సింహ, హన్మంతు, శ్రీకాంత్, వాకిటి రవి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం మండల కమిటీ ఎన్నిక



నర్వ: మండల వాల్మీకి సంఘం నూతన కమిటీ ఎన్నికను ఆదివారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ భవనంలో నిర్వహించారు. ఈ మేరకు.. జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజ్, కార్యవర్గ సభ్యులు ఉమాపతి, సుధీర్, గడ్డం నర్సింహులు ఎన్నిక పరిశీలకులుగా వ్యవహరించి ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా కావలి అయ్యన్న, గౌరవ అధ్యక్షుడిగా ఎంలక్ష్మన్న, భగవంతు, గౌరవ సలహాదారులుగా డీలర్ హన్మంతు, మండల ప్రధాన కార్యదర్శిగా రాములు, ఉపాధ్యక్షుడిగా నర్సింహ, మండ్ల శ్రీనివాసులు, ఆంజనేయులు ఎన్నికయ్యారు.

ప్రజలను మోసం చేస్తున్న సీఎం

నారాయణపేట రూరల్: లగచర్ల ఫార్మా కంపెనీ విషయంలో సీఎం రేవంత్ సొంత నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు ఒక ప్రకటనలో విమర్శించారు. లగచర్ల ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించడంతో సీఎం పల్లవి మార్చారని ఎద్దేవా చేసారు. ఇది ఫార్మా కంపెనీ కాదని పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హస్యాస్పదంగా ఉందన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

మక్తల్: పట్టణంలోని గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్ టైం టీచర్లకు రెండు నెలల నుంచి వేతనాలు అందడంలేదని ఆదివారం జిల్లా కేంద్రంలో సెక్రటరీకి వినతి పత్రాన్ని అందజేశారు. అధికారులు స్పందించి వేతనాలను విడుదల చేయాలని వారు కోరారు. వెంకటేష్, కార్యదర్శి ఆంజనేయులు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత వాసులకు సేవా పురస్కారాలు



మెమొంటో అందుకుంటున్న తిరుమలేష్

అమరచింత: అమరచింత పట్టణానికి చెందిన కవి ఉప్పరి తిరుమలేష్‌తో పాటు కురుమూర్తి స్వామి ఆలయం వద్ద అన్నదాన సత్రంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రభుదాస్‌లకు కీర్తిశేషులు బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ సేవ పురస్కారాలు అందుకున్నారు. కవి ఉప్పరి తిరుమలేష్, ప్రభుదాస్ మాట్లాడుతూ అమరచింత సంస్థాన సాహిత్య వారసత్వం కొనసాగింపుగా కురుమూర్తి స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కీర్తిశేషులు బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్టు ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ఉత్తమ సేవ పురస్కారాలు అందించారన్నారు. సాహిత్య రంగంలో తిరుమలేష్‌కు పురస్కారం దక్కగా, ఆలయంలో 20 సంవత్సరాలుగా అన్నదాన సత్రంను పర్యవేక్షిస్తున్నందుకు ప్రభుదాస్‌కు మెమొంటోలు, షాలువాతో సత్కరించారు. అమ్మపురం సంస్థానధీశులు రాజ శ్రీరాంభూపాల్, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, బెల్లం సాయిలు పలువురు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ గెలుపుపై హర్షం

మాగనూర్: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో సుమారు నాలుగు లక్షలపై మెజార్టీతో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీకి మండల కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు.. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన గాంధీ కుటుంబానికి వయనాడ్ ప్రజలు బ్రహ్మరథం పట్టారని తెలియజేశారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిని వెలిగిస్తున్న స్వాములు

మద్దూరు: మండలంలోని చింతల్‌దిన్నేలో ఆదివారం రాములు అయ్యప్పమాల దారుడి ఇంట్లో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ మేరకు.. గణపతి, సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అయ్యప్ప 18 మెట్ల పూజ నిర్వహించి పడిని వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం



మరికల్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

మరికల్: స్థానిక గ్రంథాలయ ఆవరణలో విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. యువత అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరన్న, గోపి, రామకృష్ణారెడ్డి, రమేష్, గోవర్ధన్, రామకృష్ణ, రాజు, అనిల్‌రెడ్డి, మల్లికార్జున్, మహేష్, నిఖిల్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలోని సీపీఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం సక్షమ్ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. సక్షమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ సమక్షంలో హైదరాబాద్ శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 112మందికి పరీక్షలు చేశారు. వీరిలో కంటి ఆపరేషన్ అవసరమైన 36మందిని శంకర్ కంటి ఆస్పత్రికి తరలించారు. వీహెచ్‌పీ విజయ్‌కుమార్, బసిరెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలి

- పోలింగ్ బూత్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణ
- కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్, అధికారులు



కల్వరాలలో ఓటర్ లిస్ట్ పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణమూర్తి

అమరచింత: బీఎల్‌ఓలు తమ తమ పోలింగ్ బూత్‌ల పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేయాలని ఆర్‌ఐ వెంకటయ్య అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నాగల్ కడ్మూర్‌లోని పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సెంటర్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఓటరు లిస్ట్‌లో పేర్ల మార్పులు, చేర్పులు, ఇంటి అడ్రస్‌లు, వయస్సులో తేడాలు ఉంటే వాటిని సరిచేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

- మదనాపురం మండలంలోని దుప్పల్లి పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ అబ్రహం లింకన్ పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ తారమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది రాజేష్, తదితరులు ఉన్నారు.

తప్పులు దొర్లకుండా చూడాలి

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నూతన ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి తెలిపారు. ఆదివారం కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో ఓటర్ నమోదు క్యాంపులను వారు పరిశీలించారు. ఆఫ్‌లైన్ ద్వారా మూడు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. బీఎల్‌ఓలు సుగుణాబాయ్, మహేశ్వరి, ఎల్లమ్మ, పారిజాత, చంద్రకళ, వరలక్ష్మి, కమల పాల్గొన్నారు.



పోలింగ్ బూత్ వద్ద ఓటర్ల ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్న ఆర్‌ఐ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ అబ్రహం లింకన్